ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు
జిల్లా వార్తలు

5

బుధవారం 7 ఫిబ్రవరి 2024





ప్రత్యేక బాక్స్‌లో ఊపిరితిత్తులను హైదరాబాద్‌కు తరలిస్తున్న వైద్యులు



కాలేయాన్ని విజయవాడకు తరలిస్తూ...



అంబులెన్స్‌లో కిడ్నీ ఉన్న బాక్సు





ప్రాణలత

- బ్రెయిన్ డెడ్ మహిళ నుంచి అవయవదానం
- నలుగురికి పునర్జన్మనిచ్చిన పావనిలత
- విజయవాడ, హైదరాబాద్‌కు లివర్, ఊపిరితిత్తులు తరలింపు
- జీజీహెచ్, కిమ్స్‌కు రెండు కిడ్నీలు, ఐబ్యాంక్‌కు నేత్రాలు
- కర్నూలు సర్వజన ఆసుపత్రిలో అరుదైన ఘటన

నగరంలో గ్రీన్‌చానల్

మంగళవారం మధ్యాహ్నం తర్వాత కర్నూలు నగరం ఒక్కసారిగా స్తంభించింది. ఎక్కడి వాహనాలు అక్కడే. ట్రాఫిక్ మొత్తం క్లియర్. జాతీయ రహదారి వెంట వాహనాల రాకపోకలు నిలిపివేత. ప్రధానమంత్రి, రాష్ట్రపతి పర్యటనకు మించిన వాతావరణం కనిపించింది. కర్నూలు సర్వజన ఆసుపత్రి మొదలుకుని హైదరాబాద్‌తో పాటు విజయవాడకు వెళ్లే ప్రతి రహదారినీ పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మొత్తం పోలీస్ యంత్రాంగం బారులుదీరి ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఎక్కడా ఒక్క వాహనం కూడా అడ్డు లేకుండా చూశారు. అసలు నగరంలో ఏమి జరుగుతోందో ప్రజలకు తెలియడం లేదు. అందరిలోనూ ఒకే ఉత్కంఠ. రోడ్డు వెంబడి ఉన్న నగరవాసుల్లో ఒకే టెన్షన్. మరో వైపు కర్నూలు సర్వజన ఆసుపత్రిలోని బ్లాక్ ఎదుట ఆగిన అంబులెన్సుల్లో ఆకుపచ్చని దుస్తుల్లో ఉన్న వైద్యులు ఒక్కో పెట్టెతో ఒక్కో అంబులెన్స్‌లోకి పరుగులు తీశారు. మూడు అంబులెన్స్‌లు.. దాని వెనుక పోలీసు వాహనాలు వాయువేగంతో దూసుకెళ్లాయి. గ్రీన్ చానల్ ద్వారా ఒక యుద్ధంలా సాగిన ప్రాణదాన యజ్ఞం ఇది. అంపశయ్యపై అల్లాడుతున్న బతుకులకు అవయవదానం చేసి పునర్జన్మనిచ్చేందుకు ఓ వారధి నిర్మాణంలో పోలీసులు కీలకభూమిక పోషించారు.



అవయవాలను సేకరిస్తున్న డాక్టర్లు

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 6: అనారోగ్యంతో బ్రెయిన్ డెడ్ అయిన ఓ మహిళ అవయవదానం చేసి నలుగురికి పునర్జన్మను ప్రసాదించింది. ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీ, కళ్లను దానం చేసి మరణించాక కూడా తన మానవత్వాన్ని చాటుకుంది. ఆమె కుటుంబ సభ్యులు అంగీకరించడంతో అవయవదానం చేసిన కాలేయం, ఊపిరితిత్తులను పోలీసులు ఏర్పాటు చేసిన గ్రీన్ చానల్ ద్వారా అవయవాలను విజయవాడకు తరలించారు. దీంతో కర్నూలులో మొట్టమొదటిసారిగా బ్రెయిన్‌డెడ్ మహిళ నుంచి అవయవాలను సేకరించి ఇతర ప్రాంతాలకు తరలించారు. కర్నూలు నగరంలోని బాలాజీనగర్‌కు చెందిన వీరప్రతాప్‌రెడ్డికి ముగ్గురు సంతానం. రెండో కుమార్తె పావనిలతకు తెలంగాణ రాష్ట్రం కొల్లాపూర్‌లోని నరసరావుపల్లికి చెందిన శ్రీనివాసరెడ్డితో 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల జ్యోష్న అనే బాలిక సంతానం. రెండున్నరేళ్ల క్రితం భర్త కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతి చెందాడు. భర్తను కోల్పోయిన పావనిలత ఉద్యోగం కోసం కొద్దిరోజుల క్రితం హైదరాబాదుకు వెళ్లింది. అక్కడ ఫిట్స్ రావడంతో స్థానికులు ఓ ఆసుపత్రిలో చేర్పించారు. ఆరోగ్యం విషమించడంతో ఆమెను తల్లిదండ్రులు ఈ నెల 3న వెంటిలేటర్‌పై కర్నూలు జీజీహెచ్‌కు తీసుకుని వచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 5వ తేదీన ఆసుపత్రి వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చింతా ప్రభాకర్ రెడ్డి, జీవన్‌దాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోఆర్డినేటర్ సురేష్ కుమార్, హర్షద్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డిలు అవయవాల సేకరణ కోసం పావని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారు అంగీకరించ డంతో మంగళవారం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని గుండె, ఊపిరితిత్తుల విభాగంలో వైద్యులు అవయవాలను సేకరించారు.

అవయవాలు ఎవరెవరికి..

- హైదరాబాదు కిమ్స్ హాస్పిటల్‌లో ఓ రోగికి ఊపిరితిత్తులను తరలించారు.
- విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్‌లోని ఓ రోగికి కాలేయాన్ని తరలించారు.
- కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఓ రోగికి కిడ్నీ
- కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌లోని బాధితుడికి మరో కిడ్నీ
- రెండు నేత్రాలను కర్నూలు రెడ్‌క్రాస్ ఐ బ్యాంకుకు తరలించారు.

ఆగమేఘాలపై అవయవాల తరలింపు

బ్రెయిన్‌డెడ్ అయిన పావనిలత నుంచి ఊపిరితిత్తులు, కిడ్నీ, కాలేయం అవయవాలను తరలించడానికి పోలీసులు ప్రత్యేక గ్రీన్ చానల్‌ను ఏర్పాటు చేశారు. కర్నూలు మెడికల్ కాలేజీ నుంచి గుత్తి పెట్రోల్ బంకు హైవే వరకు ప్రత్యేక పోలీసులను ఏర్పాటు చేసి అవయవాల తరలింపులో ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6:30 గంటల తర్వాత ట్రాఫిక్‌ను మళ్లించారు. దీంతో ఊపిరితిత్తులు, కాలేయ అవయవాలను ప్రత్యేక అంబులెన్సుల్లో గుత్తి పెట్రోల్ బంకు మీదుగా విజయవాడ, హైదరాబాదుకు తరలించారు. ఓ కిడ్నీని నగరంలోని కిమ్స్ ఆసుపత్రికి చేరవేశారు. మరో కిడ్నీని కర్నూలు జీజీహెచ్‌లో ఓ వ్యక్తికి అమర్పి శస్త్రచికిత్స చేశారు.



పావనిలత కుటుంబ సభ్యులతో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్



హైవేపై స్తంభించిన వాహనాలు

ఎందుకింత పరుగు?

అవయవాన్ని దాత నుంచి సేకరించిన కొన్ని గంటల వ్యవధిలోనే గ్రహీతకు అమర్చాల్సి ఉంటుంది. గుండెను నాలుగు నుంచి ఆరు గంటల్లోపు అమర్చాలి. అదే ఊపిరితిత్తులు అయితే 4-8 గంటల్లోపు అమర్చాలి. ఇక కిడ్నీలకు 24-48 గంటల సమయం తీసుకోవచ్చు. లివర్ 12-15 గంటల్లోను, ప్రాంకియాస్ 12-24 గంటల వ్యవధిలో గ్రహీతకు అమర్చాలి. లేకపోతే విలువైన అవయవాలు ఉపయోగపడకుండా పోతాయి. అందుకే ప్రతి క్షణాన్నీ విలువైనదిగా పరిగణించి పరుగులు పెడతారు. దాత నుంచి గ్రహీత వరకు ఒక్క నిమిషం కూడా వృథా కాకుండా మొత్తం గ్రీన్ చానల్ ఏర్పాటు చేస్తారు.

కర్నూలు జీజీహెచ్‌లో మొట్టమొదటి అవయవదానం



మాట్లాడుతున్న కలెక్టర్, ఆసుపత్రి డాక్టర్లు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బ్రెయిన్‌డెడ్ అయిన మహిళ నుంచి మొదటిసారిగా అవయవాలను సేకరించినట్లు కర్నూలు కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని సిటీవీఎస్ విభాగంలో కలెక్టర్‌తో పాటు సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. జీవన్‌ధాన్‌లో రిజిస్టర్ చేసుకున్న వారి అవసరాల మేరకు పావనీలతకు సంబంధించిన అవయవాలను గ్రహీతలకు చేరవేసినట్లు తెలిపారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ అవయవదానం ఏర్పాట్లు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఏర్పాటు చేశామన్నారు. మానవ శరీరంలోని అవయవాలను దాదాపు 8 మందికి ఉపయోగించుకోవచ్చన్నారు. వీటిలో చిన్నప్రేగులు, పెద్ద పేగులు, క్లోమం ఇతర భాగాలను కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు. కొందరు మూఢనమ్మకాల కారణంగా అవయవదానం చేయడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ పి.సుధాకర్, రెడ్‌క్రాస్ కమిటీ జిల్లా చైర్మన్ కేజీ గోవిందరెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్లు వెంకటతులసమ్మ, జీవన్‌దాన్ ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్లు సురేష్ కుమార్, హర్షద్, సంపత్ పాల్గొన్నారు.

సైకిల్ ఎక్కనున్న బైరెడ్డి

- టీడీపీలో చేరేందుకు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సిద్ధం
- ఈ నెల 7 తర్వాత ముహూర్తం ఖరారు
- బైరెడ్డి కుమార్తె శబరికి ఎంపీ టికెట్?
- ఎమ్మెల్యే టికెట్‌నూ ఆశిస్తున్న రాజశేఖర్ రెడ్డి





నంద్యాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి)/నందికొట్కూరు: మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సైకిల్ ఎక్కేందుకు సిద్ధమయ్యాడు. త్వరలోనే చంద్రబాబును కలిసి పార్టీలో ఆయన చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బైరెడ్డి రాజశేఖరరెడ్డికి సుదీర్ఘ రాజకీయానుభవం ఉన్న నాయకుడిగానే కాకుండా, బలమైన నేతగా పేరుంది. మొదట్లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన బైరెడ్డి, 2009 అనంతర పరిణామాలతో పార్టీని వీడారు. ఆ తర్వాత ప్రత్యేక రాయలసీమ వాదాన్ని తనదైన శైలిలో బలంగా వినిపించారు. అయితే ప్రస్తుతం ఆయన మళ్లీ సాధారణ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. తాను రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన టీడీపీ నుంచే టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దాదాపు ఆ పార్టీ పెద్దలతో చర్చలు పూర్తయ్యాయని, ఆయన ఇంట్లో ఒకరికి ఎంపీ టికెట్ ఖాయమైందని సమాచారం. అయితే బైరెడ్డి మాత్రం నంద్యాల ఎంపీ టికెట్‌తో పాటు, ఒక ఎమ్మెల్యే టికెట్ కూడా ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి బైరెడ్డి చేరిక జిల్లాలో టీడీపీకి కొత్త ఊపు తీసుకురానుండగా, నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాల్లో బలం పెరగనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎంపీ ఓకే.. ఎమ్మెల్యే టికెట్‌పైనే డౌట్!

బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సొంత గ్రామం నందికొట్కూరు నియోజకవర్గంలోని పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామం. ఆయన తండ్రి శేషశయనారెడ్డి నందికొట్కూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పలుమార్లు గెలిచారు. తండ్రి రాజకీయాన్ని అందిపుచ్చుకున్న రాజశేఖరరెడ్డి అదే నియోజకవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత నందికొట్కూరు ఎస్సీ రిజర్వుడుగా మారడంతో 2009లో పాణ్యం నుంచి బరిలోనికి దిగి ఓడిపోయారు. ఈ రెండు నియోజకవర్గాల్లో బైరెడ్డికి మంచి పట్టుంది. తన చేరిక పార్టీకి బలం పెరుగుతుంది కాబట్టి తన కుటుంబానికి ఓ ఎంపీ టికెట్, ఓ ఎమ్మెల్యే టికెట్ కావాలని బైరెడ్డి టీడీపీ పెద్దలను పట్టుబట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎంపీ టికెట్ వరకు టీడీపీ సరే అన్నట్లు తెలుస్తోంది. అది కూడా రాజశేఖరరెడ్డి కుమార్తె బైరెడ్డి శబరికి అయితేనే ఓకే అన్నట్లు సమాచారం. చివరకు టీడీపీ, రాజశేఖరరెడ్డి మధ్య అవగాహన వచ్చిందని, ఇక ఆయన పార్టీలో చేరిక లాంచనమేనన్న అభిప్రాయం పార్టీ వర్గాల నుంచి వినిపిస్తోంది. టీడీపీలో చేరిన తర్వాత కర్నూలులో భారీ బహిరంగ సభను బైరెడ్డి ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఆయన మొదటిసారి ఎన్టీఆర్ సమక్షంలో టీడీపీలో చేరినపుడు కూడా ఇదే విధంగా చేశారు. ప్రస్తుతం కూడా అదే విధానాన్ని పాటించబోతున్నట్లు సమాచారం.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి



కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్‌ఓలు, తహసీ ల్దార్లు, ఎంపీడీఓలు సంబంధిత జిల్లా అధికారు లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లాకు బదిలీపై వచ్చిన మండల స్థాయి అధికారులు ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు ఇద్దరూ కీలకం అన్నారు. త్వరితగతిన మండలాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. 15 రోజులలోపు మండలాల పరిధిలో ఉన్న అన్ని పోలింగ్ స్టేషన్లను పరిశీలించాలని ఆదేశించారు. సెక్టార్ ఆఫీసర్లు బీఎల్‌వోలతో నిర్వహించుకోవాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం రూపొందించిన ఎన్నికల నియమావళిపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. జిల్లాలో కులగణన సర్వే తర్వగా పూర్తి చేయాలన్నారు. రాయలసీమ యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ హాల్, రిసెప్షన్ కేంద్రాలను రిటర్నింగ్ అధికారులతో కలిసి తహసీల్దార్లు పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్‌వో మధుసూదన్ రావు, కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి పాల్గొన్నారు.

గరుసు దొంగలు

- అక్రమ సంపాదనలో ఎమ్మెల్యే అనుచరుడు
- భూములు నాశనం అవుతున్నాయంటున్న రైతులు
- అరేకల్లులో అధికార పార్టీ మట్టి మాఫియా...
- కళ్లు అప్పగించి చూస్తున్న రెవెన్యూ అధికారులు



అరేకల్లు కొండల్లో లారీలోకి మట్టి వేస్తున్న ఎక్స్‌కవేటర్



ఖాళీ అయిన అరేకల్లు కొండలు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 6 : దీపం ఉండగానే ఇల్లు చక్క దిద్దుకోడానికి వైసీపీ నాయకులు "సిద్ధం" అయ్యారు. ఎన్నికలు సమీపిస్తున్నందు వల్ల దొరికినంత దోచుకోవడానికి ఒడిగట్టారు. కొండలను పిండి చేస్తూ, కోట్ల రూపాయల గరుసు కొల్లగొడుతున్నారు. ఆదోని మండలం అరేకల్లులో అధికార పార్టీ వైసీపీ నాయకులు మట్టి(గరుసు) మాఫియాగా మారారు. ఇన్ని రోజులు ఆదోని కొండలను కేంద్రంగా చేసుకొని మట్టి తిని రూ. కోట్లు వెనుకేసుకొన్న వైసీపీ నాయకులు ప్రస్తుతం గ్రామాలకు రక్షణ కవచంగా ఉన్న కొండలను కొల్లగొడుతూ, జేబులు నింపుకుంటున్నారు. భూములు నాశనమవుతున్నాయని, పొలాలకు రక్షణగా ఉండే కొండలను కొల్ల గొట్టిమట్టిని ఖాళీ చేయడం వలన వర్షాలు వస్తే నీరు పంట పొలాలను ముంచెత్తుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయినా అధికార పార్టీ నాయకులు లెక్క చేయకుండా రోజుకు వందల టిప్పర్లలో మట్టిని తరలిస్తున్నారు. ఈ గరుసు దొంగలకు రెవిన్యూ అధికారులు దాసోహమైనట్లు ఆదోని ప్రజలు చర్చించుకుంటున్నారు.

మండలం అరేకల్లు గ్రామానికి కూతవేటు దూరంలో ప్రభుత్వ గ్రామ కంఠం రెవిన్యూ భూమి సర్వే నెం.3లో కొండ ఉంది. ఈ కొండలో గత కొన్ని రోజులుగా అధికార వైసీపీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి లెఫ్ట్ హ్యాండ్‌గా పేరుగాంచిన గురునాథ్‌రెడ్డి మట్టి మాఫియాకు తెగబడ్డాడు. ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా రోజుకు వంద లారీలు, వంద ట్రాక్టర్లకుపైగా మట్టి అమ్ముకుంటున్నాడు. యథేచ్ఛగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నాడు. ఈ వైసీపీ ప్రబుద్ధుడికి అధికారులు దాసోహం అయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. చిన్న చిన్న దొంగతనాలు చేసేవారిపై చర్యలు తీసుకొనే అధికారులు తమ కళ్లెదుటే ఆహ్లాదకరమైన కొండలను పిండి చేసి మట్టిని మింగుతున్నా ఎందుకు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక లారీ గరుసు రూ.5వేలు, ఒక ట్రాక్టర్ గరుసు రూ.1,500 పడుతుందని, అలా రోజుకు లక్షల్లో అక్రమంగా మట్టిని అమ్ముకొని వైసీపీ నాయకులు అక్రమ సంపాదనకు సిద్ధమయ్యారు. వీరి అక్రమాలకు అడ్డుకట్ట వేసే నాథుడే కరువయ్యాడు. కాగా తహసీల్దార్ హసీనా సుల్తానాను ఈ విషయం మీద అడిగితే.. తక్షణమే గ్రామ వీఆర్‌ఓలకు చెప్పి గరుసు తవ్వకాలను నిలిపేసి విచారణ చేపడతాం అన్నారు.

ఎమ్మెల్యేకు చెప్పుకున్నా ప్రయోజనం లేదు: అరేకల్లు రైతులు

వైసీపీ నాయకుడు గురునాథ్‌రెడ్డి మా పంట పొలాలకు అనుకొని ఉన్న కొండల్లో మట్టిని తొవ్వుకొని పోవడం వలన వర్షం వచ్చినప్పుడు నీరు పొలాల్లోకి ప్రవహించి పంటలు నాశనమవుతున్నాయి. వందల మట్టి లారీలు పంట పొలాల్లో తిరగడం వలన భూములు నాశనమవుతున్నాయి. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. అయినా మట్టి రవాణా జరుగుతూనే ఉంది.



ట్రాక్టర్‌లో గరుసు తరలింపు

ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం... రూ.14 లక్షలు స్వాహా

కర్నూలు, ఫిబ్రవరి 6: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఓ మహిళ ఆన్‌లైన్‌లో క్యాపిటల్ షేర్ మార్కెటింగ్ పేర రూ.14 లక్షలు స్వాహా చేసింది. కర్నూలులోని సంతోష్‌నగర్‌కు చెందిన షాహీనాకు ఇన్‌స్టాగ్రామ్‌లో అన్యారెడ్డి పరిచయమైంది. ఆన్‌లైన్ యాప్‌లో బిజినెస్ చేస్తే మంచి లాభాలు ఉంటాయని 'పూరుటో క్యాపిటల్ షేర్ మార్కెట్' పేరిట ఓ యాప్‌ను పరిచయం చేసింది. విడతల వారీగా రూ.14 లక్షలు తన ఖాతాలో వేయించుకుంది. ఆ తర్వాత ఈమె ద్వారా పరిచయమైన లిండా అగ్రియా అనే వ్యక్తి కూడా కొంత మొత్తాన్ని పెట్టుబడి పెట్టించారు. అనంతరం యాప్ నుంచి డబ్బును విత్‌డ్రా చేసుకునేందుకు షాహీనా ప్రయత్నించి విఫలమైంది. అన్యారెడ్డికి కాల్ చేస్తే ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. మోసపోయానని గ్రహించిన బాధితురాలు షాహీనా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఫోర్త్‌టౌన్ సీఐ శంకరయ్య తెలిపారు.

భూములివ్వం

- గ్రామ సభ రసాభాస
- తెల్ల కాయితం మీద సంతకాలు చేయించుకున్నారని ఆరోపణ
- సోలార్ పరిశ్రమకు భూములివ్వమని ఏకగ్రీవ తీర్మానం

ప్రాణాలైనా ఇస్తాం...

ఓర్వకల్లు, ఫిబ్రవరి 6: సోలార్ పరిశ్రమకు భూములు ఇచ్చే ప్రసక్తే లేదని.. ప్రాణాలైనా అర్పిస్తాంగాని పంట పొలాలు వదులుకోమని రైతులు గ్రామ సభలో తెగేసి చెప్పారు. మంగళవారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ పవర్ ప్లాంటు వద్దని గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. రైతులకు మద్దతుగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, నాయకుడు నాగన్న మద్దతు తెలిపారు. గ్రామంలోని సచివాలయం ఎదుట జరిగిన ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ శకుంతలమ్మ అధ్యక్షత వహించారు. ఈ సభకు గ్రామ పంచాయతీ అధికారి శ్రీలత, వీఆర్వో మధుసూదన్, ఎంపీటీసీ సరోజమ్మ హాజరై సభను ప్రారంభించారు. సభ ప్రారంభం కాగానే పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సోలార్ ప్లాంటు వద్దు.. మా భూములు కాపాడండని నినాదాలు చేశారు. అనంతరం సర్పంచ్ శకుంతలమ్మను మహిళలు దురుసుగా మాట్లాడటంతో గ్రామ సభ రసాభాసగా మారాంది. దీంతో సర్పంచుకు, రైతులకు మధ్య వాదోపవాదాలు జరిగాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీలత స్పందిస్తూ సోలార్ పవర్ ప్లాంటును వ్యతిరేకిస్తూ రైతులు చేసిన విజ్ఞప్తికి స్పందించి గ్రామంలో సోలార్ ప్లాంటు అవసరం లేదని, గ్రామ సభ ద్వారా ఏకగ్రీవంగా తీర్మానించినట్లు అజెండా చదివి వినిపించారు. ఈ సభలో సుమారు 400 మంది రైతులు, ప్రజల సంతకాలను సేకరించారు. సోలార్ నిర్మాణానికి వ్యతిరేకిస్తూ తీర్మానాన్ని ఆమోదించారు. సర్పంచ్ శకుంతలమ్మ మాట్లాడుతూ సోలార్ అధికారులు సాగుకు ఉపయోగపడని ప్రభుత్వ భూమి మాత్రమే సోలార్ పరిశ్రమకు తీసుకుంటామని చెప్పి ఖాళీ పేపరుపై సంతకాలు తీసుకుని వెళ్లారని, అయితే.. రైతులు సోలార్ పరిశ్రమకు భూములు ఇచ్చే ప్రసక్తే లేదని ఏకగ్రీవ తీర్మానం గ్రామసభలో చెప్పారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలత మాట్లాడుతూ గ్రామ సభలో సర్పంచు ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయం మేరకు గ్రామ సభలో ఏకగ్రీవ తీర్మానం చేశామని, దీన్ని ఉన్నతాధికారులకు పంపించామని ఆమె తెలిపారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ గ్రామంలో సోలార్ ప్లాంటు నిర్మాణం చేపడుతున్నట్లు క్యాబినెట్ తీర్మానం చేయడంతో రైతులు తీవ్ర ఆందోళన చెంది ధర్నాలు చేపట్టారని అన్నారు. భూముల్లో వందలాది మంది రైతులు మామిడి తోటలు, పూల తోటలు, వివిధ రకాల


ఉయ్యాలవాడలో సర్పంచుతో వాగ్వివాదం చేస్తున్న రైతులు

పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. ఈ భూముల్లో బోరు బావులు ఉన్నాయని, మండలంలో డీఆర్‌డీవో, సోలార్, విమానాశ్రయం, ఉక్కు పరిశ్రమలతో పశువులకు మేత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అయితే పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా స్థానికేతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం సరికాదన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో గ్రామ సభల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం.. గ్రామాభివృద్ధికి మౌలిక సదుపాయాలు కల్పిస్తామంటూ పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని వీటన్నింటినీ విస్మరిస్తున్నారన్నారు.

ప్రాణాలైనా అర్పిస్తాం.. భూములు ఇచ్చే ప్రసక్తే లేదు

మా ప్రాణాలైనా అర్పిస్తాం.. సోలార్ పరిశ్రమకు భూములు ఇచ్చే ప్రసక్తే లేదు. గత రెండు రోజులుగా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉయ్యాలవాడలోని సచివాలయం ఎదురుగా నిరసన కార్యక్రమాలు చేపట్టాం. పోరాడి మా భూములు మేము దక్కించుకుంటాం.
- బోయ ఎల్ల రాముడు, రైతు

పరిశ్రమ వద్దే వద్దు

ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ పరిశ్రమ ఏర్పాటు చేయవద్దు. పరిశ్రమల వల్ల ఉన్న భూములు కోల్పోవాల్సి వస్తుంది. పశువులకు గొర్రెలకు మేత లేని పరిస్థితి ఏర్పడుతుంది. సోలార్ పరిశ్రమ ఏర్పాటైతే.. కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తుంది. సోలార్‌కు భూములు ఇచ్చే ప్రసక్తే లేదు.
- మహబూబ్ బాషా, రైతు

ఆత్మహత్యలే శరణ్యం

గ్రామంలో పరిశ్రమ ఏర్పాటు చేయడానికి వీల్లేదు. రైతులను చంపేసి పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాల్సిందే. పరిశ్రమ వల్ల సారవంతమైన భూములను కోల్పోవాల్సి వస్తుంది. మొండిగా పరిశ్రమలు చేస్తామంటే ఆత్మహత్య చేసుకుంటాం.
- మొల్ల అల్లికేర్, రైతు


సంతకాలు చేస్తున్న రైతులు

శ్రీశైలంలో తెలంగాణ మద్యం

భారీగా పట్టుపడ్డ బాటిళ్లు


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

శ్రీశైలం, ఫిబ్రవరి 6: శ్రీశైలంలో గత నాలుగు రోజులుగా పోలీసులు జరిపిన తనిఖీల్లో భారీగా తెలంగాణ మద్యం పట్టుబడింది. తెలంగాణ రాష్ట్రం మున్ననూరుకు చెందిన ఓ మహిళ క్షేత్ర పరిధిలో మద్యం విక్రయిస్తుందనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో దాదాపు 166 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై సీఐ ప్రసాదరావు మాట్లాడుతూ క్షేత్రపరిధిలో మద్యం, మాంసం నిషేధం ఉన్నప్పటికీ కొందరు వాటిని గుట్టుచప్పుడుగా విక్రయిస్తున్నారన్నారని అన్నారు. అక్రమ మద్యంపై నిఘా పెంచామని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ప్రసాదరావు హెచ్చరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అక్రమ వ్యాపారం చేస్తున్న అధికార పార్టీ నాయకులు

కోసిగి, ఫిబ్రవరి 6: మండలంలోని తుమ్మిగనూరు గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు గుడికల్లు హుశేనీ, హనుమేష్ అనే వ్యక్తులు తుంగభద్ర నదిని దాటి 13 అక్రమ కర్ణాటక మద్యం బాక్సులు తీసుకువస్తుండగా.. కోసిగి సెబ్ సీఐ మహబూబ్‌బాషా, ఎస్ఐ రమేష్‌బాబు మంగళవారం దాడి చేసి 1248 టెట్రా ప్యాకెట్లు, 90 ఎంఎల్ ఒరిజినల్ చాయిస్ మద్యం స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.51వేల విలువ ఉంటుందని వారు తెలిపారు. తుమ్మిగనూరు తుంగభద్ర నదీతీరంలో ఉండటంతో కళ్లు గప్పి పారిపోయినట్లు సెబ్ పోలీసులు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అక్రమంగా అధికార పార్టీ నాయకులు కర్ణాటక మద్యాన్ని సరఫరా చేసి డంపు ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామాల్లో చర్చ జరుగుతుంది. నిందితులను అరెస్టు చేస్తామని సెబ్ పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ పోలీసులు రాయుడు, నాగరాజు, మధు, నాగరాజు పాల్గొన్నారు.

మహిళ బలవన్మరణం

వెల్దుర్తి, ఫిబ్రవరి 6: మండలంలో బింగిదొడ్డి గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్వరమ్మ(25) అనే మహిళ మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం ఇంట్లో ఎవరులేని సమయంలో ఇంటి పైకప్పు దెంతలకు చీర కట్టుకొని ఉరి వేసుకుంది. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న స్థలాన్ని ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. మృతిచెందడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన బీటీ నాయుడు

శాసన మండలిలో ఉపనాయకుడిగా ఎదురుదాడి



కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 6: ఈ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వ వైఫల్యాలను శాసన మండలి ఉపనాయకుడు బీటీ నాయుడు సమావేశాల్లో ఎత్తిచూపారు. మంగళవారం శాసన మండలి సమావేశాల్లో 2వ రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే అంశంపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ఎండగట్టారు. నాలుగేళ్ల బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో అబద్ధాలు పలకలేక గవర్నర్ నీళ్లు తాగారన్నారు. గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో 5 కోట్ల మంది ప్రజలకు రాజధాని లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి పోలవరం ప్రాజెక్టుని ఏం చేశారని ప్రశ్నించారు. వీటి గురించి గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావనే లేదని, మెగా డీఎస్సీ, డీఎస్సీలేక పోవడం వల్ల వేలాది మంది విద్యార్థులు రోడ్డు పాలయ్యారని గుర్తు చేశారు.

బీఈడీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 6: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో అక్టోబరు 2023లో జరిగిన బీఈడీ ప్రథమ సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ విడుదల చేశారు. మంగళవారం ఉదయం ఉపకులపతి చాంబర్‌లో విడుదల చేసిన ఫలితాలను వెబ్‌సైట్‌లో ఉంచారు. రెగ్యులర్ విభాగంలో 2,827 మందికి గాను 1,477 మంది ఉత్తీర్ణత సాధించారు. సప్లిమెంటరీ విభాగంలో 813 మందికి 357 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వర్సిటీ అధికారులు వెల్లడించారు.

నులిపురుగుల నివారణ దినాన్ని పాటించండి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 6: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ నెల 9వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేయాలని డీఈవో శ్యామేల్‌పాల్ మంగళవారం తెలిపారు. పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ నులిపురుగుల మందును వేయించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీఈవో తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు డీఈవో కార్యాలయానికి పంపాలని సూచించారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయాధికారి


ఖైదీల వివరాలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా న్యాయాధికారి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 6: పత్తికొండ పట్టణంలో మంగళవారం జిల్లా న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు పత్తికొండ సబ్ జైలును, ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించారు. సబ్ జైలును సందర్శించిన జిల్లా న్యాయాధికారి శ్రీనివాసరావు ఖైదీల యోగక్షేమాలను, జైలులో స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఖైదీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అలాగే పట్టణంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్, అంజనేయ నగర్‌లో ఉన్న ఇంటర్ బాయ్స్ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని విద్యార్థులకు ప్రభుత్వపరంగా అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలని హాస్టల్ నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ చంద్రమోహన్, న్యాయవాదులు దామోదరాచారి, నగేష్, హాస్టల్స్ వార్డెన్లు తదితరులు ఉన్నారు.

మంచాలమ్మకు పంచామృతాభిషేకం


అలంకరణలో మంచాలమ్మ దేవత

మంత్రాలయం, ఫిబ్రవరి 6: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. మంగళవారం విశేష మాఘమాసం ఏకాదశి శుభ సందర్భాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో పండితులు, అర్చకులు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, విశేష పంచామృతాభిషేకం చేసి పట్టుచీర, బంగారు, వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలు, ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

శ్రీమఠంలో నిజ బృందావన దర్శనం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో స్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకున్నారు. మంగళవారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు రద్దు చేశారు. అర్చకులు బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి పూజలు చేశారు.

టీడీపీలోనే బీసీలకు పెద్దపీట

- వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి
- 'జయహో బీసీ'లో గౌరు చరిత


మాట్లాడుతున్న పాణ్యం టీడీపీ ఇన్‌చార్జ్ గౌరుచరిత

కల్లూరు, ఫిబ్రవరి 6: తెలుగుదేశం పార్టీ బీసీలకు పెద్దపీట వేసి వారిని సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఉన్నతస్థానాల్లో నిలిపిందని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జ్ గౌరుచరిత పేర్కొన్నారు. మంగళవారం పాణ్యం నియోజకవర్గంలోని చెన్నమ్మసర్కిల్లో గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో జయహోబీసీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు, పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలపై దాడులు, దౌర్జన్యాలు కేసులు అధికమయ్యాయన్నారు. బీసీలపై జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు జయహోబీసీకి పిలుపునిచ్చారని తెలిపారు. రాష్ట్రంలో వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయని, రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని ఆమె స్పష్టం చేశారు. గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అవినీతి అక్రమాలకు చెక్ పెట్టే రోజులు వచ్చాయన్నారు. దూపాడులోని 139 సర్వేలో పేదలకు ఇచ్చిన ఇళ్లస్థలాల్లో జగనన్న ఇళ్లు ఎందుకు కట్టించలేకపోయారో తెలపాలన్నారు. టీడీపీ జనసేన నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి చంద్రబాబును సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెరుగు పురుషోత్తంరెడ్డి, కె.పార్వతమ్మ, నాగేశ్వరరావు యాదవ్, బెస్తమల్లికార్జున, వలసల రామకృష్ణ, శ్రీరాములు, మహానంది, అమర్‌నాథ్, మహేష్, తిరుపాల్‌బాబు, ధనుంజయ, కృష్ణయ్య, ఫిరోజ్, రామకృష్ణ. పవన్‌కుమార్, మాదేష్, డి.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న ప్రజలు

సహకార ఎన్నికలకు గుడ్‌బై చెప్పేశారు..

- రుణాల మంజూరులో ఇష్టారాజ్యం
- కమీషన్ల కోసం కక్కుర్తి



కల్లూరు సహకార సంఘం కార్యాలయం

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 6: అన్నదాతలకు పొలాల అభివృద్ధి, పంటల సాగు కోసం రుణాలు మంజూరు చేసే కార్యక్రమాన్ని వాణిజ్య బ్యాంకుల కంటే మెరుగ్గా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు నిర్వహిస్తున్నాయి. ఈ సంఘాలకు పాలకవర్గాలను ఐదేళ్లకోసారి రైతులు ఎన్నుకుంటున్నారు. చివరిసారిగా రాష్ట్రంలో 2013లో ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. 2018తో ఈ పాలకవర్గం పదవీకాలం ముగిసినా వివిధ కారణాలతో ఎన్నికలు జరగలేదు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతులు పాలకవర్గాలను ఎన్నుకునే అవకాశాన్ని కల్పిస్తారనీ ఆశతో ఎదురు చూశారు. ఐదేళ్లు పూర్తి కావస్తున్నా జగన్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. పాలకవర్గాల నియామకాన్ని ఎమ్మెల్యేల సిఫారసుల ఆధారంగానే ఆరు నెలలకొకసారి నామినేట్ చేస్తూ వస్తుండే తప్పా శాశ్వత ప్రాతిపదికన ఎన్నికలను నిర్వహించలేకపోయింది. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సహకార సంఘాలకు ఎన్నికలను నిర్వహించేందుకు రెండేళ్ల క్రిందట రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. ఇంతలో కొవిడ్ వ్యాప్తితో ఈ ప్రక్రియ కాస్త వెనక్కు వెళ్లిపోయింది. ఆ తర్వాత వైసీపీ శ్రేణులు రైతుల జాబితాను సేకరించి ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వంలోని కీలక నేతల సూచనల మేరకు కసరత్తు మొదలు పెట్టారు. అయితే ఎన్నికలకు వెళ్తే వ్యతిరేక ఫలితాలు వస్తాయన్న నిఘా వర్గాల హెచ్చరికలతో వెనక్కు తగ్గారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉండగా.. వాటిల్లో 6 లక్షల మంది రైతులు సభ్యులుగా చేరారు. వీరంతా ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలను తీసుకుంటున్నారు.

నీరుగారుతున్న సేవలు

సంఘాల్లో పారదర్శకత లోపిస్తోంది. సహకార రంగంలో వినూత్న మార్పులు వచ్చినా ఈ సంఘాల్లో మాత్రం ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని అధికారులే అభిప్రాయపడుతున్నారు. పాలకవర్గం ప్రతినిధులు రుణాల మంజూరులో చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నట్లు రైతుల నుంచి ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. మరోవైపు రుణాల స్వాహా తంతు యథేచ్ఛగా జరుగుతున్నట్లు ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. అయినా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉన్నతాధికారులు అధికార పార్టీలోని రాజకీయ నాయకుల ఒత్తిడితో వెనకడుగు వేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం సహకార సంఘాల ఎన్నికలకు సంబంధించి ఎలాంటి ఊసెత్తకుండా ఇప్పటికే ఎమ్మెల్యేల సిఫారసుతో విధులు నిర్వహిస్తున్న త్రీమెన్ కమిటీలనే మరో ఆరు నెలలు పదవిలో ఉండేలా ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. దీనిపై రైతుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన తర్వాతనే ఇక సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని, అప్పటి దాకా సహకార సంఘాల్లో జరుగుతున్న అవినీతి భాగోతంపై ఎవరూ నోరెత్తలేని పరిస్థితి దాపురించిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారిగా శ్యామేల్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 6: కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారిగా శ్యామేల్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ప్రవీణ్ ప్రకాష్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా డీఈఓగా పనిచేస్తున్న రంగారెడ్డి పదవీ విరమణ చేయడంతో పోస్ట్ ఖాళీ ఏర్పడింది. దీంతో స్టేట్ స్కూల్ ఎడ్యుకేషన్‌లో మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న శ్యామేల్‌ను రెగ్యులర్ డీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయము, ఆదోని.

Roc.No.AGC-05-12/2/2019-MRKT RFMS-RTG. Dt: 06.08.2023

టెండరు నోటీసు

వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఆదోని మార్కెట్ యార్డు నందు స్థాపించియున్న మల్టీ కమోడిటీ గ్రేడింగ్ మరియు ప్యాకింగ్ మిషన్‌ను నిర్వహణ అనుభవం కల్గి ఉండి, సాంకేతిక అనుభవం కల్గి ఉన్నవారి నుండి నెలసరి అద్దె ప్రాతిపదికన సీల్డ్ టెండర్లను ఆహ్వానించడమైనది.

టెండరు షెడ్యూలు జారీ తేదీ	తేదీ : 12-02-2024 నుండి 14-02-2024 సాయంత్రము 5.00 గంటల వరకు
టెండరు దాఖలు తేదీ	తేదీ : 15-02-2024 ఉదయము 10.30 గంటలలోపు
టెండరు తెరుచు తేదీ	తేదీ : 15-02-2024 ఉదయము 11.00 గంటలలోపు

సూచిక : మరిన్ని వివరాలకై వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఆదోని కార్యాలయము నందు పని దినములలో సంప్రదించగలరు.

సం/- ఎంపిక శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఆదోని.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 6: నగరంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. మంగళవారం మౌర్యఇన్‌లో 22వ వార్డుకు చెందిన మహిళలు టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరం చుట్టు తుంగభద్ర, హంద్రీ, కేసీ కెనాల్ ఉన్నప్పటికీ తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. అప్పట్లో తన తండ్రి టీజీ వెంకటేష్ నిర్మించిన సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదన్నారు. చెక్ డ్యాం నిర్మిం చాలని ఆయన అనుకున్నారని, అయితే ఆ తర్వాత వచ్చిన పాలకులు దాని గురించి పట్టించుకోలేదని అన్నారు. రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి కష్టాలు వస్తే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన ప్రభుత్వంలో అందరికీ మేలు జరుగుతుందన్నారు. నగరంలోని 4వ వార్డు చిత్తారి వీధికి చెందిన పలు వురు టీడీపీ నాయ కురాలు నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో మహిళలు టీడీపీలో చేరారు. కార్యక్ర మంలో వార్డు ఇన్‌చార్జి శ్రీధర్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్

క్రీడాకారులకు సహకారం అందిస్తా

కర్నూలు(స్పోర్ట్స్): కర్నూలు క్రీడాకారులకు తమ వంతు సహకారం అందిస్తామని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని పుల్లారెడ్డి కళాశాల సమీపంలోని గేమ్ ఆన్ మైదానంలో ఈనెల 4, 5 తేదీల్లో ఈద్గా జూని యర్ ప్రీమియర్ లీగ్ బాక్స్ క్రికెట్ టోర్నమెంటు జరిగింది. ఈ లీగ్ పోటీల్లో 20 జట్లు పాల్గొన్నాయి. ఇందులో విజేతగా నిలిచిన మాజీద్‌బాషా టీమ్‌కు రూ.9 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన ఆసీఫ్ ఆలీ టీమ్‌కు రూ.6వేలు టీజీ భరత్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బాలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వినియోగించుకోండి: పీడీ


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 6: కూలీలంతా ఉపాధి పనులను వినియోగించుకోవాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణ శివారులో కాల్వ పూడిక తొలగించే పనులను ఆయన తనిఖీ చేసి మస్టర్ హాజరు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటలు పెంచుకోవాలని సూచించారు. ఆయన వెంట డీబీసీడబ్ల్యూ ఈవో (ట్రైనీ) భరత్‌కుమారొరెడ్డి ఏపీవో మోదీన్‌సాహెబ్, ఎఫ్ఏ మధు ఉన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

సి.బెళగల్, ఫిబ్రవరి 6: ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో శకుంతల ఏపీవో లక్ష్మన్న, ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఉపాధి సిబ్బందితో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో రోజుకు ఉపాధి కూలీలు మూడు వేలకు తగ్గకుండా చూడాలన్నారు. జాబు కార్డులో పేరు ఉన్న వారిని మాత్రమే ఉపాధి పనికి అనుమతించాలన్నారు. ఉపాధి కూలీలు ఉదయం 7 నుంచి 11 గంటలలోపు పని ముగించుకోవాలన్నారు.

టీడీపీని కలిసికట్టుగా గెలిపించుకుందాం

కర్నూలు(రూరల్), ఫిబ్రవరి 6: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కోడుమూరు నియోజకవర్గంలో అందరం కలిసికట్టుగా పనిచేసి టీడీపీని గెలిపించుకుందా మని పార్టీ ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ పిలుపునిచ్చారు. బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనై జింగ్ సెక్రటరీగా విజయకుమార్ నియామకంపై మంగళవారం నగరంలో వేంకటేశ్వర కల్యాణ మండపంలో అభినందన సభ నిర్వహించారు. ఈకార్యక్ర మానికి ఆయన హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలనను అంతం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు.

ఐదేళ్ల తర్వాత డ్యూటీ రోస్టర్

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 6: ఐదేళ్ల తర్వాత ఎంఎన్‌వోల డ్యూటీ రోస్టర్‌ను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డా.వి.వెంకటరంగారెడ్డి ఆదేశాల మేరకు 60 మంది ఎంఎన్‌వోలకు మొట్టమొదటిసారిగా రోస్టర్ ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయిస్ నోటీసు బోర్డులో సర్జంట్‌ను ఎస్.శ్రీనివాసులు అతికించారు. ఐదేళ్ల తర్వాత ఎంఎన్‌వోల డ్యూటీ రోస్టర్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు వేశారని కొందరు హర్షం వ్యక్తం చేశారు.

సీనియర్ అకౌంటెంటు డిప్యుటేషన్ కొనసాగింపు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 6: నగర పాలక సంస్థలో డిప్యుటేషన్ ప్రాతిపదికన పని చేస్తున్న సీనియర్ అకౌంటెంటు పి. మల్లికార్జునను మరో సంవత్సరం కొనసాగిస్తూ మున్సిపల్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం ట్రెజరి యూనిట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అతనిని కార్పొరేషన్‌లో సీనియర్ అకౌంటెంట్‌గా సంవత్సరంపాటు డిప్యుటేషన్‌పై నియమించారు. మరో సంవత్సరంపాటు డిప్యుటేషన్ కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రగ్బీలో విద్యార్థులకు బంగారు పతకాలు

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 6: రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ఆదర్శ విద్యామందిర్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆదర్శ విద్యాసంస్థల వ్యవస్థాపకులు బి. తిమ్మయ్య ప్రతిభ కనబరిచిన విద్యార్థులు భరత్, రామ్‌చరణ్, సూరి, మహేష్‌బాబులకు పతకాలు, ట్రోఫీని అందజేశారు. ఈసందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు మహబూబ్ సుభాని, సుదర్శన్, హెచ్‌ఎం సుదర్శన్ విద్యార్థులను అభినందించారు.

167 పోలింగ్ కేంద్రాలకు వెబ్ క్యాస్టింగ్

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 6: కర్నూలు నియోజకవర్గంలో 167 పోలింగ్ కేంద్రాలకు వెబ్ క్యాస్టింగ్ అవసరమని కర్నూలు అసెంబ్లీ ఎలక్ట్రోలర్ రిజిస్ట్రేషన్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ కలెక్టర్ డా.జి.సృజనకు లేఖ రాశారు. మొత్తం 258 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

పర్యావరణపై అవగాహన సదస్సు


సదస్సులో పాల్గొన్న ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర డైరెక్టర్, విద్యార్థినులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 6: నగరంలోని వెంకటరమణ కాలనీలోని కేశవరెడ్డి పాఠశాలలో పర్యావరణపై అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. పాఠశాలను ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర డైరెక్టర్ స్రవంతి సందర్శించి మాట్లాడారు. ప్రస్తుతం గ్లోబల్ వార్మింగ్ మారిపోతున్న తరుణంలో గాలి, నేల, నీరును కాపాడుకోవడం మనందరి బాధ్యతని అన్నారు. న్యూట్రిషన్ గార్డెన్ డెవలప్మెంట్, పవర్ సేవింగ్, వాటర్ సేవింగ్ ఎలా చేయాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్.కేశవరెడ్డి మాట్లాడుతూ రోజురోజుకు మారిపోతున్న గ్లోబల్ వార్మింగ్‌ను చూస్తే రాబోయే తరాలకు గాలి, నేల, నీరు కరువయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని, వాటి నుంచి భావితరాలు బయట పడాలంటే వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్, ఎంఈవో ప్రభావతమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళలకు బీజేపీ పెద్దపీట

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 6: మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత బీజేపీదేనని మహిళా మోర్చా రాష్ట్ర ఉపా ధ్యక్షురాలు జయలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాఘవేంద్ర అన్నారు. మంగళవారం స్థానిక 46వ వార్డు నరసింహారెడ్డినగర్‌లోని నారీశక్తి-శక్తి వందన కార్యక్రమాన్ని నిర్వహించారు.

దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 6: ఈనెల 16న జరిగే దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. మంగళవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, కిసాన్ సంయుక్త మోర్చా జాతీయ రైతు సంఘాల ప్రజా సంఘాల దేశవ్యాప్త బంద్‌ను తలపెట్టాయని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మతవి ద్వేశాలను రెచ్చగొడుతుందని అన్నారు. నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, డిప్యూటీ కార్యదర్శి రామాంజనేయులు, ఆర్.కృష్ణారెడ్డి, మద్దిలేటి పాల్గొన్నారు.

నిధుల మంజూరు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 6: గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులకు మూడు మున్సిపాలిటీలకు నిధులు మంజూరు చేస్తూ కలెక్టర్ జి.సృజన్న ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు మున్సిపాలిటీ రూ.26,50,000, ఆదోని రూ.20,00,000, ఎమ్మిగనూరు రూ.20,00,000 మొత్తం రూ.66,50,000లను మంజూరు చేశారు. ఇటీవల పనులకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపానదలు పంపినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిధులతో డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, పార్కుల అభివృద్ధి కోసం వినియోగిస్తారు.

● కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో తాగునీటి సరఫరాకు సంబంధించి రూ.15 కోట్లు విడుదల చేస్తూ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆనందరావు ఉత్తర్వులు జారీ చేశారు. పైప్‌లైన్ల నిర్మాణం కోసం పరిపాలన ఉత్తర్వులు విడుదల చేశారు.

నేడు సంగీత కళాశాలలో త్యాగరాజ స్వామి ఆరాధన

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 6: నగరంలో ఆర్డీవో కార్యాలయం కాంపౌండ్‌లోని శారదా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో బుధవారం సాయంత్రం 5 గంటలకు త్యాగరాజ స్వామి 177వ ఆరాధనోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సి. మునికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో, విశ్రాంత సంగీత అధ్యాపకురాలు సి. సరస్వతి నేతృత్వంలో ఈ ఆరాధనోత్సవం ఉంటుందని ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

సి.బెళగల్, ఫిబ్రవరి 6: కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు. మండలంలోని కంబందహాల్ గ్రామానికి చెందిన అంజినేయులు(65) సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పతికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 6: పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకరప్ప డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అశోక్‌నగర్ సెంటర్ నుంచి ఈపీఎఫ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సుధాకరప్ప మాట్లాడుతూ వివిధ పారిశ్రామిక వాడలలో పని చేస్తూ పెన్షన్ పొందుతున్న వారు రాష్ట్రంలో లక్షా యాభైవేల మంది ఉన్నారన్నారు. ప్రైవేటు సంస్థలలో 20-30 సంవత్సరాలుగా పని చేస్తూ రిటైర్డ్ అయిన తరువాత రూ.1000 పెన్షన్ వస్తే ఎలా బతకాలని అన్నారు. గత ఎన్నికల్లో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక కనీస పెన్షన్ రూ.3 వేలే ఇస్తామని వాగ్దానం చేసి పదేళ్లు గడుస్తుందన్నారు. కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని ఆందోళనలు చేస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు చలనం లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాక్రిష్ణ, నాయకులు ప్రభాకర్, మద్దిలేటి, అసోసియేషన్ నాయకులు శంకర్‌రావు, మురళీమోహన్‌హరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం


మాట్లాడుతున్న జేసీ

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: పాణ్యం నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌లో మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటామని పాణ్యం నియోజకవర్గ ఈఆర్వో, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో పాణ్యం నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో, తహసీల్దార్లతో, ఈఆర్వోలతో ఆమె సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ నారపురెడ్డి మౌర్య మాటా్లడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బదిలీపై పాణ్యం నియోజకవ ర్గానికి వచ్చిన తహసీల్దార్లు ప్రతి పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేసి మౌలిక వసతులపై రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించారు.

ఆర్డీవోను కలిసిన యూనియన్ నాయకులు


ఆర్డీవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యూనియన్ నాయకులు

కోడుమూరు, ఫిబ్రవరి 6: కర్నూలు ఆర్డావో శేషిరెడ్డిని రెవెన్యూ యూనియన్ నాయకులు మర్యాద పూర్వకంగా మంగళవారం కలిశారు. యూనియన్ అధ్యక్షుడు, కోడుమూరు డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు, నాయకులు వేణుగోపాల్, నాగరాజు, సనాఫ్రిన్, భాను ఎన్నికల బదిలీపై కర్నూలు విచ్చేసిన ఆర్డీవోను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వం


మాట్లాడుతున్న బేతం కృష్ణుడు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: వైసీపీ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తుందని జిల్లా వాల్మీకి బోయసేవా సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేతం కృష్ణుడు అన్నారు. మంగళవారం వాల్మీకి బోయసేవా సంస్థ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కేవలం ఒక సామాజిక వర్గానికి ఎమ్మెల్యేలు, ఎంపీ, నామి నేట్ పదవులు కేటాయిస్తున్నారని ఆరోపించారు. కానీ బీసీలకు ఎలాంటి పదవులు ఇవ్వడం లేదని అన్నారు. నగరంలోని వెంకయ్యపల్లె ఎల్లమ్మ ఆల యం చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తలారి కృష్ణ, శేఖర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మోటారు బైక్ చోరీ

కర్నూలు, ఫిబ్రవరి 6: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాఘవేంద్రనగర్‌లో లోకేశ్ అనే వ్యక్తికి చెందిన మోటారు సైకిల్ చోరీకి గురైంది. లోకేశ్ కారు డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. ఇటీవల సెకండ్ హ్యాండ్ బైక్‌ను కొనుగోలు చేశాడు. ఈనెల 1వ తేదీన రాత్రి ఇంటిముందు ఉంచగా.. ఉదయం లేచి చూస్తే బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశా డు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుంకులా పరమేశ్వరికి వెండి వడ్డాణం


ఆలయ సిబ్బందికి వెండి వడ్డాణం అందజేస్తున్న భక్తుడు

గూడూరు, ఫిబ్రవరి 6: మండలంలోని కె.నాగలాపురం సుంకులాపరమేశ్వరి అమ్మవారికి యనగండ్ల గ్రామానికి చెందిన సి.రాజు అనే భక్తుడు 215 గ్రాముల వెండి వడ్డాణం బహూకరించినట్లు ఆలయ సిబ్బంది కేశవ తెలిపారు. మంగళవారం ఆలయంలో అమ్మవారిని దర్శిం చుకున్న రాజు వెండి వడ్డాణం కానుకగా ఆలయ చైర్మన్ ఎల్. ఉమామహేశ్వరమ్మ సమక్షంలో దేవస్థానానికి సమర్పించినట్లు కేశవ తెలిపారు.

నకిలీ పురుగుల మందులను విక్రయిస్తే చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ

సి.బెళగల్, ఫిబ్రవరి 6: నకిలీ పురుగుల మందులను విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ గిరిష్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని పురుగుల మందులు, సీడ్సు దుకాణాల్లోని రికార్డులను కర్నూలు వ్యవసాయ శాఖ ఏడీఏ గిరిష్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ దుకాణాల యజమానులు రైతులకు విక్రయించే ప్రతి దానికి బిల్లులు ఇవ్వాలని, స్టాక్ వివరాలను రికార్డులలో నమోదు చేయాలని అన్నారు. ఏడీఏ వెంట ఏవో మల్లేష్‌కుమార్, ఎంఈవోలు ఉన్నారు.

29న దివ్యాంగుల సింహగర్జన


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: కర్నూలులో ఈనెల 29న దివ్యాంగుల సింహగర్జన నిర్వహిస్తున్నామని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప నాగరాజు తెలిపారు. మంగళవారం దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయం కరపత్రాలను విడుదల చేశా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు పెన్షన్ రూ.6000 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈరన్న, వెంకటేష్, శివశంకర్ పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన కల్పించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్, వైద్యసిబ్బంది

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 6: మార్చి 3న జరిగే పల్స్ పోలియోపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం లద్దగిరి పీహెచ్‌సీలో ఆశా డే సమా వేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 9న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో పీసీపీఎన్‌డీటీ లీగల్ కన్సల్టెంట్ సుమలత, వైద్యులు జయంతి, భాస్కర్, శ్రీమంత్, సీహెచ్‌వో శాంత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

ప్రత్యేక చట్టాన్ని అమలు చేయాలి



ధర్నా చేస్తున్న ఎస్‌డీపీఐ నాయకులు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 6: ప్రార్థనా స్థలాల చట్టాన్ని అమలు చేయాలని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు షేక్ జహంగీర్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ జ్ఞానవాపి మసీదు తీర్పులో కోర్టు 1991 ప్రార్థనా స్థలాల చట్టాన్ని విస్మరించిందని అన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం కొనసాగితే మత స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛకు ప్రమాదమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు షేక్ ఖలీల్ అహ్మద్, నాయకులు చాంద్ బాషా, ఖాదర్‌బాషా, అమీర్‌మియ్యా, జలీల్ పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమికి అంత సీను లేదు

మోదీ ఏవిధంగా గెలుస్తారో చెప్పాలి: డీసీసీ

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 6: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 140 సీట్ల కంటే ఎక్కువ గెలిచే సీను లేదని డీసీసీ అధ్యక్షుడు కే. బాబురావు అన్నారు. మంగళవారం ఉదయం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ కూటమి 400 సీట్లు గెలుస్తామంటున్న మోదీ ఏవిధంగా గెలుస్తారో చెప్పాలని అన్నారు. బీజేపీ లక్షల కోట్ల అప్పు తెచ్చి 1000 సంవత్సరాల అభివృద్ధి జరిగిందని ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఎంత మంది ఓబీసీలు ఉన్నారో శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ పూర్తిగా ఈవీఎంలను వ్యతి రేకిస్తుందని, బ్యాలెంట్ పేపర్లు పెట్టమని సుప్రీం కోర్టులో కేసు వేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఎక్కువ అవినీతి జరిగిందని వైసీపీ ఎంపీ విజయ సాయిరెడ్డి చెబుతున్నారని, కాంగ్రెస్ వైపు వేలు ఎత్తి చూపే అర్హత ఆయనకు లేదని మండి పడ్డారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు బీ. బతుకన్న, నాయకులు లాజరస్, సత్యానారాయణ గుప్త, మహిళా అధ్యక్షు రాలు ప్రమీల, సేవాదళ్ అధ్యక్షుడు ఏ.వెంకట సుజాత, లలిత, షేక్ మాలిక్, పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామికి బంగారం సమర్పణ

బేతంచెర్ల, ఫిబ్రవరి 6: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామివారికి 100 గ్రాముల బంగారాన్ని కర్నూలు నగరం శేషాద్రినగర్‌కు చెందిన కొడితల పెద్ద లక్ష్మయ్య కుమా రుడు కోడితల శ్రీనివాసులు సమర్పించారని ఈవో పాండురం గారెడ్డి, చైర్మన్ సీతా రామచంద్రుడు మంగళవారం తెలిపారు. భక్తుడికి తీర్థప్రసా దాలు అందజేశారు. ధర్మకర్త లక్ష్మీనాయుడు, వెంగళ్ రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేద్దాం

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 6: రైతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేద్దామని మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి అన్నారు. మంగళవారం కర్నూలు మార్కెటింగ్ శాఖ ఏడీఎం కార్యాలయంలో మార్కెట్ కమిటీల ఉద్యోగుల సంఘం కమిటీ నాయకుల ఆధ్వర్యంలో సంఘం క్యాలెండర్‌ను ఏడీఎం నారాయణమూర్తి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సం ఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు రహిమాన్, ఇతర ప్రతినిధులు వెంకటేశ్వర్లు, నాగేష్, శివన్న, కేశవరెడ్డి పాల్గొన్నారు.


కంప్యూటీకరణను వేగవంతం చేయండి

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 6: గ్రామాల్లోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో కంప్యూటీకరణ వేగవంతం చేయాలని జిల్లా సహకార శాఖ అధికారి రామాంజినేయులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని చేనేత, జౌళిశాఖ కాన్ఫరెన్స్ హాల్లో కంప్యూటీకరణకు సంబంధించిన శిక్షణా కార్యక్రమం జరిగింది. సంఘాలకు ప్రభుత్వం ఇప్పటికే పంపిణీ చేసిన కంప్యూటర్లలో డేటా ఎంట్రీ తదితర పరిజ్ఞానాన్ని వివరాలను ఏవిధంగా నమోదు చేయాలో అధికారులకు ఆయన వివరించారు. ఈ సమావేశానికి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో రామాంజనేయులు, డీజీఎంలు ఉమా మహేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, సహకార శాఖ రిజిస్ట్రార్ సుశీల పాల్గొన్నారు.

హైపో ద్రావణం పిచికారి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 6: నగరంలో దోమల వ్యాప్తిని నివారించేందుకు నగర పాలక సంస్థ అధికారులు పలు ప్రాంతాలలో హైపో ద్రావణాన్ని పిచికారి చేశారు. సీనియర్ ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లు పర్య వేక్షణలో ప్రధానంగా డ్రైనేజీ, నీటి నిల్వలు ఉన్న చోట ద్రావణాన్ని పిచికారి చేశారు.

శతాధిక వృద్ధుడి మృతి


మహ్మద్ హుశేన్(ఫైల్)

బేతంచెర్ల, ఫిబ్రవరి 6: పట్టణంలోని బైటిపేట కాలనీకి చెందిన మహ్మద్ హుశేన్(104) అనే శతాధిక వృద్ధుడు మంగళవారం తెల్లవారుజామున మృతి చెందా డు. మహ్మద్ హుశేన్ వృత్తిరీత్యా వ్యవసాయదారుడని, చివరి దాకా తన పని తాను చేసుకొనేవాడని, నిత్యం నమాజుకు కూడా హాజరవుతుండేవాడని కుటుంబసభ్యులు, పరిచయస్తులు తెలిపారు. మహమ్మద్ హుసేన్‌కు ఇద్దరు కుమారులు, ఐదుగురు కూతుళ్లు సంతానం ఉన్నారు. మన మళ్లు, మనవరాళ్లు 23 మంది ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

తెలంగాణ మద్యం సీజ్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 6: తెలంగాణ నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సీజ్ చేశామని సెబ్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళ వారం పంచలింగాల చెక్ పోస్టు, మీదివేముల, బస్తిపాడు, సల్కాపురం గ్రామాల్లో డీటీఎఫ్, సెబ్ స్టేషన్ల ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. నలుగురు వ్యక్తుల నుంచి నాటుసారాతోపాటు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని, నిందితులపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ నరసానాయుడు, ఎస్ఐలు వీర స్వామి, రహనాబేగం, మారుతీ ప్రసాద్, సిబ్బంది వెంకటరాముడు, షేక్షావలి, సుదర్శన్ రాజు, మధుసూదన్‌రెడ్డి, బషీర్, కరుణాకర్ పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 6: జిల్లాలోని నిరుద్యోగులకు గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి పి.దీప్తి తెలిపారు. గురువారం సీ.క్యాంప్‌లోని ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రముఖ కంపెనీల్లో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రిలేషన్ సిప్స్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్, డిగ్రీ, ఏదైనా డిప్లమా చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ధువప్రతాలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డుతో హాజరు కావాలని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వేతనం ఉంటుందని అన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ

మద్దికెర, జనవరి 6: మద్దికెర గ్రామంలోని ఎస్ఐగా రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐను మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, బొమ్మనపల్లి సర్పంచ్ అంజినేయులు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఎస్ఐ రమేష్‌బాబు మాట్లాడుతూ మద్దికెర మండలంలో ఎక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తాలుకా తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్‌గౌడు, మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఎన్.విజయకుమార్ ఉన్నారు.

పంట నమోదు తప్పనిసరి

మద్దికెర, జనవరి 6: మండలంలో రైతులు రబీలో సాగు చేసిన పంటలను తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవలని వ్యవసాయ శాఖ అధికారి రవి తెలిపారు. మంగళవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈక్రాఫ్‌తో పాటు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రైతులు ఈకేవైసీని ఆర్‌బీకేలో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయ సిబ్బంది జాకీర్, ఆనంద్, రవి తదితరులు ఉన్నారు.

నష్ట పరిహారం వెంటనే అందించాలి

మద్దికెర, జనవరి 6: మండలంలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు పూర్తిగా నష్టపోయారని, వారికి పంట నష్టపరిహారం ఇవ్వాలని మండల సీపీఎం శాఖ కార్యదర్శి కడవల రవికుమార్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సునీతకు వినతిపత్రం అందజేశారు. రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందన్నారు. మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినప్పటికీ ఇప్పటిదాకా కరువు సంబంధించిన ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో వెంటనే తాగునీటికి సంబంధించి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

మంత్రాలయం, ఫిబ్రవరి 6: మండలంలో ఆటో డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి ఆటోలను సీజ్ చేస్తామని మాధవరం ఎస్ఐ కిరణ్‌బాబు, ఏఎస్ఐ బందెనవాజ్ హెచ్చరించారు. మంగళవారం మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. వారు మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్సు, ఆటో ఇన్సూరెన్సు, పర్మిట్, ఫిట్నెస్ వంటి రికార్డులు ఖచ్చితంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వీరేష్, భాస్కర్, ఆటో డ్రైవర్లు ఇజ్రాయేల్, ఆదాం, దేవ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

దేవనకొండ , ఫిబ్రవరి 6: మండలంలో నాలుగో విడత కింద విడుదలైన చెక్కులను మంగళవారం వైసీపీ కన్వీనర్ మల్లికార్జున, తపాల శ్రీనివాసులు, రామచంద్ర, ఏపీఎం రమేశ్, ఏపీజీబీ మేనేజరు రామకృష్ణ పొదుపు మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో నర్సన్న, శివ, సహదేవా, ఉరుకుందు,యూసుప్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిపై విచారణ చేపట్టాలి

మంత్రాలయం, ఫిబ్రవరి 6: మంత్రాలయం వ్యవసాయాధికారి జీర గణేష్ అవినీతి అక్రమాలపై బుధవారం జరిగే విచారణను పకడ్బందీగా చేపట్టాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కిం జానయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ మంత్రాలయం వ్యవసాయాధికారి జీర గణేష్‌పై నకిలీ విత్తనాలు, నకిలీ పరుగు మందులుపై గత మూడు నెలలుగా జైభీమ్ ఎమ్మార్పీఎస్ ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. బుధవారం వ్యవసాయాధికారి అవకతవకలపై జిల్లా అధికారులు విచారణ చేపడుతారన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సంగటి యోహాన్, మారెన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 6: రహదారి భద్రత మాసోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ ప్రాంగణంలో రోడ్డు రవాణా సంస్థ సిబ్బందికి వివిధ వైద్య పరీక్షలను నిర్వహించారు. వివిధ విభాగాలలో పనిచేస్తున్న 120 మంది ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్లు గోపీనాథ్, కృష్ణమూర్తి, ఉషారావు, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షుడు ధర్మారావు, వన్నప్ప రాజు, మల్లికార్జున గౌడ్, ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ రఫీక్ పాల్గొన్నారు.

వలంటీర్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదోని టౌన్, ఫిబ్రవరి 6: పట్టణంలోని బావాజీపేట వార్డు వలంటీరు అధికారుల అనుమతి లేకుండా సిమెంట్ మురుగునీటి పైపులైన్ కోసం రోడ్డును తవ్వేశారని, వలంటీర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రచార కార్యదర్శి బోయ తిమ్మప్ప డిమాండ్ చేశారు. మంగళవారం మునిసిపల్ డీఈ నాగభూషణం రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. రోడ్డును తవ్వేయడం రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. వెంటనే వలంటీర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పట్టాలన్నీ రిజిస్ట్రేషన్ చేయాలి

వెల్దుర్తి, ఫిబ్రవరి 6: జగనన్న కాలనీలో ప్రజలకిచ్చిన పట్టాలన్నింటిని రిజిస్ట్రేషన్ చేయాలని సీపీఐ నాయకులు మండల కార్యదర్శి కృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కలగొట్ల గ్రామంలో జగనన్న కాలనీలో ఇచ్చిన పట్టాలు చెల్లవంటూ అధికారులు చెప్పడం ప్రజలను మోసగించడమేనన్నారు. 10వతేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిన్నమాదులు, గిడ్డయ్య, రాము, సురేంద్ర పాల్గొన్నారు.

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే

టీడీపీ అధికారంలోకి రావాలి

- మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

గోనెగండ్ల, ఫిబ్రవరి 6: తెలుగుదేశం పార్టీ పాలనతోనే ఏపీలో అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం పెద్దమరివీడు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో జెండాను ఎగుర వేశారు. పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. రాత్రి బస అక్కడే చేశారు. అంతకుముందు గ్రామంలోని వీదుల్లో తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే పేద ప్రజలకు, నిరుద్యోగులకు, యువతకు మహిళలకు చేసే అభివృద్ధి పనులను గురించి వారికి వివరించారు. సీఎం జగన్ పాలనలో ఏపీకి పూర్తిగా అన్యాయం జరిగిందని ఏపీలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ పాలనలో రాయలసీమ ప్రాజెక్టులకు నిధులు విడుదల అయినప్పటికీ జగన్ రివర్స్ టెండర్ పెట్టి నిధులను మొత్తం మళ్లించాడని ఆయన తెలిపారు. ఆర్డీఎస్, గుండ్రేవుల, వేదవతి, ప్రాజెక్టు పూర్తి అయితే రాయలసీమలో తాగు, సాగు నీటిని ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. ఎమ్మిగనూరు, కోడుమూడు, మంత్రాలయం, కర్నూలు నియోజవర్గాలు సస్యశ్యామలం అవుతాయని తెలిపారు. రాష్ట్రంలో పాలన ఉన్నదా లేదా అనే విధంగా తయారైందని రైతులకు ఇంతవరకు ఏ లాంటి మేలు చేసే పని చేయలేదని వైసీపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వంగా మారిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరుపతయ్యానాయుడు, నూరహమ్మద్, బేతాళబడేసా, భారతం రహంతుల్లా, టౌన్ ప్రెసిడెంట్ రమేష్‌నాయుడు, రంగస్వామినాయుడు, జయపాల్, అబ్దుల్లా, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెద్దమరివీడులో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి: కేఈ శ్యాంబాబు

తుగ్గలి, ఫిబ్రవరి 6: వైసీపీ పార్టీకి రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అమీనాబాదులో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పిచ్చి తుగ్లక్ పాలన నడుస్తోందన్నారు. గ్రామాల్లో సమస్యలతో సతమతమవుతున్నారని, సర్పంచులు అసెంబ్లీని ముట్టడించడానికి వెళ్లితే.. వారిని వెళ్లనీయకుండా నోటీసులను జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. సీఎం జగన్ నవరత్నాల పేరుతో నవ మోసాలు చేసి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు. నిత్యం అబద్ధాలు చెబుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్తును అంధకారం చేశారన్నారు. వైసీపీ అరాచకాలతో ప్రజలు విసిగిపోయారన్నారు. రాబోయే ఎన్నికల్లో పత్తికొండ నియోజకవర్గంలో టీడీపీని గెలిపించుకుని చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ రాష్ట్ర శాలివాహన చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, సురేష్ చౌదరి, బత్తిన వెంకట్రాముడు, మనోహర్ చౌదరి, మధుబాబు, సర్పంచ్ విజయలక్ష్మి, రమేష్, రాంబాబు, గిరిగిట్ల మల్లికార్జున, సత్యప్రకాష్ పాల్గొన్నారు.

వైభవంగా సుంకులమ్మ దేవర

తుగ్గలి: సుంకులమ్మ అమ్మవారి దేవర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండల పరిధిలోని అమీనాబాదులో గ్రామ దేవత సుంకులమ్మ దేవర ఉత్సవాల్లో భాగంగా భక్తులు వారి కోర్కెల మేరకు అమ్మవారికి బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర,మధుబాబు, సురేష్ చౌదరి, బత్తిన వెంకట్రాముడు, మధుబాబు, మనోహర్ చౌదరి, రమేష్, రాంబాబు తదితరులు ఉన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న శ్యాంబాబు, నాయకులు

మద్దికెర, జనవరి 6: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సుంకులమ్మ అమ్మవారి దేవర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మంగళవారం కాలనీలోని మూలవిరాట్ సుంకులమ్మ అమ్మవారిని నిమ్మకాయలు, పుష్పాలు, ఆకులతో అలంకరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

13 తర్వాత ఉద్యమ బాట చేపడతాం

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 6: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించనని పక్షంలో ఈనెల 13 తర్వాత ఉద్యమ బాట చేపడతామని ఎమ్మిగనూరు తాలుకా జేఏసీ చైర్మన్ మద్దిలేటి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏపీఎన్జీవో కార్యాలయంలో ఏపీజేఏసీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జేఏసీ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వరప్రసాద్, బసవరాజు, కెరె కృష్ణ, కాశింజి, ఏపీ వీరన్న, మల్లికార్జున, మోకేష్, శివరామిరెడ్డిలు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు 12వ పీఆర్‌సీని కమిటీతో చర్చించి ఐఆర్30శాతం ప్రకటించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జీపీఎస్, ఏపీజీఎల్ఐ ఎర్నుడ్ లీవ్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం రద్దు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో దశలవారి పోరాటం చేస్తామన్నారు. ఈనెల 11న సమావేశమై సమిష్టి నిర్ణయం మేరకు 12వ తేదీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమ్మె నోటీసు ఇచ్చి 13 తర్వాత ఉద్యమంలోకి వెళ్లేందుకు వెనుకాడబోమన్నారు. సమావేశంలో నాయకులు యాదగిరి, ప్రభు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఏపీఎన్‌జీవో కార్యాలయం దగ్గర నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 6: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించకపోతే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని ఏపీ ఎన్జీవో ఆదోని తాలూకా అధ్యక్షుడు రమేష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఏపీ ఎన్జీవో భవనంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఉద్యమాలు చేసున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నాలుగున్నర ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. రావాల్సిన బకాయిలను చెల్లించకుండా నాన్చుడి ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. ఈనెల 12న ఏపీ జేఏసీ రాష్ట్ర కమిటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ కలిసి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, లేనిపక్షంలో సమ్మెలోకి వెళ్తున్నట్లు నోటీసు అందజేస్తుందన్నారు. సమావేశంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యాసిన్ బాషా, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున రెడ్డి, ఉపాధ్యక్షురాలు ఉషారాణి, విజయ్‌రాజు, రామ్మోహన్ రెడ్డి, బజారప్ప, ఆంజనేయులు పాల్గొన్నారు.



ఆదోనిలో మాట్లాడుతున్న ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు రమేష్ రెడ్డి

'గుమ్మనూరు' నుంచి ప్రాణహాని ఉంది

● వైసీపీ మద్దతుదారు సర్పంచ్ ప్రేమ్‌కుమార్

చిప్పగిరి, ఫిబ్రవరి 6: ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని చిప్పగిరి అంబేడ్కర్ విగ్రహం వద్ద వైసీపీ నాయుకులు నిరసన వ్యక్తం చేశారు. సర్పంచ్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ 'సర్పంచుగా నిన్ను నేను గెలిపిస్తే, ఆలూరు వైసీపీ సమన్వయకర్త విరుపాక్షి వెంట తిరుగుతావా..? ఎట్లా తిరుగుతావో చూస్తా... అలాగే వెళితే చంపుతా'నని ఫోనులో బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయాన్ని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మహమ్మద్ రిజ్వాగ్‌ను కలిసి విన్నవించినట్లు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ఆలూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎవ్వరికి టికెట్ ఇచ్చినా, నిలిచి పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. గుమ్మనూరు నారాయణ నుంచి తనకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. ప్రేమ్‌కుమార్‌కు మద్దతుగా నగరడోణ, ఏ రూరు గ్రామ సర్పంచుల భర్తలు నాగేంద్ర, సేనాపతి, నేమకల్లు వైసీపీ నాయకుడు ఎంపీటీసీ సుంకన్న, సత్యరెడ్డి, మోహన్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



చిప్పగిరి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సర్పంచ్ ప్రేమ్‌కుమార్, సర్పంచులు, నాయకులు

ఎన్నికల్లో పోటీ కోసం దరఖాస్తు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 6: కర్నూలు పార్లమెంట్, లేదా ఆదోని అసెంబ్లీకు జరిగే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని పార్టీ సీనియర్ నాయకులు బోయ నీకంఠప్ప తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు ఇచ్చానని తెలిపారు.



దరఖాస్తును అందజేస్తున్న బోయ నీలకంఠప్ప

ముగిసిన అర్చక శిక్షణా తరగతులు



అర్చకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అర్చక ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్లు

మంత్రాలయం, ఫిబ్రవరి 6: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో గురు రాజాంగ భవనంలో రెండు రోజులు చేపట్టిన అర్చక శిక్షణా తరగతులు మంగళవారం విజయవంతంగా ముగిశాయి. అర్చక ట్రైనింగ్ అకాడమి డైరెక్టర్ విష్ణువర్ధన్, దేవదాయ అర్చక సంఘం అధికార ప్రతినిధి సూర్యనారాయణాచార్ ఆధ్వర్యంలో వీరశైవ అదమం సలహాదారుడు శశిభూషణ్ సిద్ధాంతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ కేఎస్ రాజేష్‌లు పూజా విధానాలపై మాట్లాడారు. అర్చకులకు పాటించాల్సిన బాధ్యతలు, విధి విధానాలు, నిష్ఠ వంటి అంశాలపై క్లుప్తంగా వివరించారు. రెండు రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న అర్చకులకు సర్టిఫికేట్లను అందజేశారు. ముఖ్యఅతిథులుగా మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అర్చకులు భాస్కరాచార్, వంశీకృష్ణ, ప్రవీణ్ కుమార్, అమ్రేష్, వీరేష్, మౌనేషాచార్ పాల్గొన్నారు.

రాష్ట్ర అబాకాస్ పోటీలకు ఎంపిక

ఆదోని(అగ్రికల్చర్), ఫిబ్రవరి 6: ఉమ్మడి జిల్లా అబాకస్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థి రితిక్ ప్రతిభ కనబరిచినట్లు సాయి భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ దుర్గేష్ తెలిపారు. మంగళవారం ప్రతిభ కనబరిచిన విద్యార్థి రితిక్‌ను అభినందించారు. స్టార్ జూనియర్ లెవల్లో రెండో స్థానం దక్కించుకొని రాష్ట్రస్థాయి అబకాస్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● ఆర్ఐవో గురువయ్య శెట్టి

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 6: ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐవో గురువయ్య శెట్టి పేర్కొన్నారు. మంగళవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఇంటర్ పరీక్షలపై కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియట్ సైన్స్ ప్రాక్టికల్స్ మార్కులను తప్పకుండా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపాలన్నారు. ప్రాక్టికల్స్ మార్కులపై ఫిర్యాదులు అందడంతో, ఇకనుంచి ప్రతి కళాశాల ఏ రోజుకారోజు జరిగిన ప్రా క్టికల్స్ పరీక్షలను, విద్యార్థుల మార్కులను వెంటనే ఆన్‌లైన్ ద్వారా పొం దుపరచాల్సి ఉంటుందన్నారు. పరీక్షల నిర్వహణకు అధ్యాపకులు సిద్ధం గా ఉండాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ మురళీమోహన్, డీవీవో ప్రకాష్ రావు, జిల్లా పరీక్షల కమిటీ సభ్యుడు ప్రభు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

దేవనకొండ ,ఫిబ్రవరి 6 : దేవనకొండ క్రాస్ రోడ్డులో డ్రైనేజీ పనులకు వైసీపీ నాయకులు లుముంబా, రామచంద్ర భూమి పూజ చేశారు. ఎంపీపీ నిధులు రూ.5 లక్షలతో డ్రైనేజీ పనులు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

15వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలి

గోనెగండ్ల, ఫిబ్రవరి 6: ప్రతి రైతు 15వ తేదీలోపు పంట నమోదు ఈకేవైసీ చేయించుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత కోరారు. మంగళవారం హెచ్ కైరవాడి, అలువాల, పెద్దనేలటూరు గ్రామాలలోని ఆర్‌బీకే సెంటర్లను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు 60 శాతం మాత్రమే ఈకేవైసీ పూర్తయిందని, ఇంకా 40 శాతం కావాల్సి ఉందన్నారు. కావున రైతులు వెంటనే తమ సమీపంలోని ఆర్‌బీకే సెంటర్లలో ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆర్‌బీకే ల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం



ఎంపీడీవోను సన్మానిస్తున్న సిబ్బంది

ఆదోని రూరల్, ఫిబ్రవరి 6 : ఆదోని ఎంపీడీవో గీతావాణి బదిలీపై అనంతపురం జిల్లా రాప్తాడుకు వెళ్లడంతో మంగళవారం సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంపాపతి, పీఆర్ఎఈ మాలిక్, ఏఓ శేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



కళాశాల అధ్యాపకుడు క్రాంతికుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డా. మహబూబ్ బాషా, అధ్యాపక బృందం

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 6: ఎమ్మిగనూరు మహాయోగిలక్ష్మమ్మ ప్రభుత్వ డిగ్రీకళావాలో రసాయన శాస్త్రవిభాగాధిపతిగా పనిచేస్తున్న డా.బి క్రాంతికుమార్‌కు ఉస్మానియ యునివర్శిటి, హైదరాబాద్ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. అధ్యాపకుడు డా. క్రాంతికుమార్ డిజైన్ అండ్ ఫ్యాబ్రికేషన్ ఆఫ్ మెటల్ ఆక్సైడ్, సల్ఫైడ్ బేస్డ్ హెటిరోజంక్షన్ నానో కాంపోసిట్స్ ఫర్ గ్యాస్ సెన్సింగ్ అప్లికేషన్ అనే అంశంపై ప్రొఫెసర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పరిశోధనలు చేశారు. ఈ పరిశోధనకు గాను ఆయనకు ఉస్మానియ యునివర్శిటి డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. మంగళవారం ప్రిన్సిపాల్ డా. కే మహబూబ్ బాషా, అద్యాపక బృదం క్రాంతికుమార్‌ను అభినందించారు.

దరఖాస్తు చేసుకోండి

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 6: పట్టణంలోని ప్రభుత్వం డీగ్రీ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్ బోధించడానికి గెస్ట్ అధ్యాపకుడి పోస్టుకి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శివారెడ్డి తెలిపారు. గంటకు రూ.400 ప్రభుత్వం చెలిస్తుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఎంఎస్సీ కంప్యూటర్స్ లేదా ఎంసీఏలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈనెల 8న తమ సర్టిఫికెట్లతో వైఎంకె పాఠశాలలోని ప్రభుత్వ డీగ్రీ కళాశాలలో డెమోకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 9866041775లను సంప్రదించవచ్చన్నారు.

అనంతపురానికి తరలిరండి...

చిప్పగిరి, ఫిబ్రవరి 6: అనంతపురంలో 11న జరిగే సిద్ధం బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచులు భారీ ఎత్తున తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని ఆలూరు వైసీపీ సమన్వయకర్త విరుపాక్షి పిలుపునిచ్చారు. మంగళవారం చిప్పగిరిలోని గోవిందప్ప స్వామి దేవాలయం వద్ద సిద్ధం వాల్‌పోస్టర్లను ఆయన చేతుల మీదుగా విడుదల చేశారు.

వాహనాలను జాగ్రత్తగా నడపాలి : ఆర్టీవో దీప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదోని ఆర్టీవో దీప్తి

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 6: వాహనాలు నడిపే ప్రతి డ్రైవర్ వాహనాలను జాగ్రత్తగా నడపాలని ఆదోని ఆర్టీవో దీప్తి అన్నారు. మంగళవారం మినీలారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదోని ఆర్టీవో దీప్తి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రమేష్‌బాబు, లారీ, అబులెన్స్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అక్రమ రవాణాను అరికట్టాలి

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 6: ఎమ్మిగనూరు పట్టణంలో జోరుగా సాగుతున్న కర్ణాటక అక్రమ మద్యంతో పాటు, పీడీఎస్ అక్రమ రైస్ సరఫరాను అరికట్టాలని సీపీఐఎంఎల్ డివిజన్ కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ ఏఎస్ఐ కిష్టప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ప్రసాద్, నాయకులు యేసేపు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

పెద్దకడుబూరు , ఫిబ్రవరి 6: విశాఖపట్నంలో 10, 11వ తేదీల్లో జరిగే డీటీఎఫ్ రజతోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడు పిలుపునిచ్చారు. మంగళవారం పెద్దకడుబూరులోని ఎంఈవో కార్యాలయం ముందు అధికారులు వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.

చింతకుంట కొండలో చిరుతపులి హల్‌చల్

కోసిగి, ఫిబ్రవరి 6: మండలంలోని చింతకుంట గ్రామంలోని కొండలో చిరుత పులి హల్‌చేసింది. గత రెండేళ్ల కాలంలో కొండలో చిరుత పులులు ఆవాసంగా ఏర్పాటు చేసుకుని మేకలు, గొర్రెలపై దాడులు చేస్తూ గొర్రెల కాపరులకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. మంగళవారం ఉదయం గ్రామ సమీపంలో ఉన్న కొండలో మేకల మందపై చిరుత పులి దాడి చేసి మేకపోతును కొండలోకి లాకెళ్లి చంపినట్లు రైతు ఎర్రదొడ్డి నరసయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ఫారెస్టు అధికారులకు సమాచారం అందించినా చిరుతపులిని బంధించడంలో విఫలమవుతున్నారన్నారు. సుమారు రూ. 20వేలు విలువ చేసే మేకపోతు చిరుత పులి దాడిలో మృతి చెందిందని రైతు వాపోయాడు.

నేడు క్రిష్ణగిరిలో 'జయహో బీసీ'

క్రిష్ణగిరి, పిబ్రవరి 6: క్రిష్ణగిరిలో బుధవారం జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అద్యక్షుడు కటారుకొండ మర్రి శ్రీరాములు మంగళవారం తెలిపారు. పత్తికొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కేఈ శ్యాంబాబు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మహిళ అరెస్టు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 6 : ఆదోని మండలం ఇస్వీ గ్రామానికి చెందిన హరిజన జయమ్మను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం తన నివాసంలో సదరు మహిళ కర్ణాటక మద్యాన్ని అమ్ముతుండగా, అదుపులో తీసుకొని తన వద్ద నుంచి 100 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇస్వీ ఎస్.ఐ శ్రీనివాసులు తెలిపారు.

ప్రజలు శాంతియుతంగా జీవించాలి



ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 6: గ్రామాల్లో ప్రజలు శాంతియుతంగా జీవించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య కోరారు. మంగళవారం కడివెళ్ల గ్రామంలో ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డితో కలిసి పల్లె నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. డీఎస్పీ సీతారామయ్య మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు ఒకరికొకరు కలసిమెలసి ఉండాలన్నారు. గ్రామంలో ఎవరైనా ఘర్షణలకు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగస్వామి, మాజీ సర్పంచ్ కృష్ణయ్యతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యువత అభివృద్ధికి సాఫ్ట్ స్కిల్స్ అవసరం

ఆదోని టౌన్, ఫిబ్రవరి 6: వివిధ రంగాలలో తగిన గుర్తింపు, ప్రాముఖ్యత, ప్రావీణ్యత సంపాదించుకోవడం కోసం సాఫ్ట్ స్కిల్స్ పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాయల్ సాఫ్ట్ స్కిల్స్ (హైదరాబాద్) ఫౌండర్ డాక్టర్ వివేకానంద రాయపెద్ది అన్నారు. మంగళవారం జరిగిన మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ వారి సౌజన్యంతో నిర్వహిస్తున్న మహాయోగి లక్ష్మమ్మ సొసైటీ 20వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. టౌన్ బ్యాంక్ ఆధ్వర్యంలో యువతకు వివిధ రంగాలలో ప్రోత్సాహం అందించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ శెట్టి, బ్యాంక్ డైరెక్టర్ ఆర్ఎంజీ రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ శాస్త్రి, పాల్గొన్నారు.